చెట్టుపై నుంచి పడి
వ్యక్తి మృతి

పూడూరు, మార్చి 19: ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండల పరిధిలోని సిరిగాయపల్లి గ్రామానికి చెందిన అంబాటి నారాయణ (53) పెద్ద ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన సుభాష్ పొలం వద్ద చింతచెట్టుపై చింత పండు రాల్పుతుండగా, ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మలు విరిగి కిందపడ్డాడు. దీంతో అతడి కాళ్లు, చేతులు విరిగి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

పరిగిటౌన్, మార్చి 19 : పరీక్ష రాసేందుకని ఇంటి నుంచి బయలుదేరిన ఓ విద్యార్థిని (18) అదృశ్యమైన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లాపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని పరిగి పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నది. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన విద్యార్థిని తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బైక్ చోరీ.. కేసు నమోదు

కులకచర్ల, మార్చి 19 : మోటరు సైకిల్‌ను దొంగి లించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీన కులకచర్ల గ్రామానికి చెందిన ఫిర్యాది శంకర్ తన బైక్ చోరీకి గురైనట్లు కులకచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరాపూర్ గ్రామానికి చెందిన బంక యాదయ్య అనే వ్యక్తి బైక్‌ను తీసుకొని హైదరాబాద్ వెళ్లగా మంగళవారం పోలీసులు యాదయ్యను అరెస్టు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

యాలాల, మార్చి 19 : కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం లభ్యమైన ఘటన తాండూరు పట్టణంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సంగారెడ్డి జిల్లా హరిదాసుపల్లి గ్రామానికి చెందిన నాగరాజుగౌడ్(40) హైదరాబాద్‌లో ఆటో నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తాండూరు పట్టణంలో నివసిస్తున్న అతడి అక్క అనురాధ వద్దకు శివరాత్రి పండుగ నిమిత్తం వచ్చాడు. మరుసటిరోజు నుంచి కనిపించకుండా పో యాడు. అతడు తిరిగి హైదరాబాద్ వెళ్లి ఉం టాడని అనుకున్నారు. తాండూరు పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయం వెనక నిర్మానుష్య ప్రదేశంలో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకొన్న మృతుడి అక్క అనురాధ ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి చెవి పోగులు, చేతి కడియాలు చూసి నాగరాజు గౌడ్‌గా గుర్తించింది. మృతుడి బావ శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి టౌన్, మార్చి 19 : డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన పరిగి సమీపంలోని హైదరాబాద్–సుల్తాన్ పూర్ గేటు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం యాద్‌గిర్ జిల్లా బాలసెడి గ్రామానికి చెందిన శాలప్ప బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా బస్సును ఓవర్‌టేక్ చేయబోయి డీసీఎంను ఢీ కొన్నాడు దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

ప్రశాంతంగా పది పరీక్షలు

బొంరాస్‌పేట, మార్చి 19 : ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు మంగళవారం రెండవ రోజు కూడా ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 517 మంది విద్యార్థులకుగాను 516 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఒకరు గైర్హాజర య్యారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే లోపలికి అనుమతించారు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా కల్యాణం

కులకచర్ల, మార్చి 19 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో రుక్మిణీ పాండు రంగ స్వామి 21వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రుక్మిణీ పాండు రంగ స్వామి కల్యాణోత్సవాన్ని పూజారి, ఉత్సవ సమితి అధ్యక్షుడు కరణం నాగేశ్వర్‌రావు నిర్వహించారు. రెండు రోజులుగా దేవాలయం లో వివిధ రకాల సేవలు, పూజలు, ఉత్స వాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

అసంపూర్తిగా కల్వర్టు నిర్మాణ పనులు

కల్వర్టుపై పొంచి ఉన్న ప్రమాదం

నవాబుపేట, మార్చి 19 : ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను చేపడుతుంటే, కొంతమంది కాంట్రాక్టర్లు ఖాసులను పోగుచేసుకోవడానికి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తూ చేసే పనులను అసంపూర్తిగా వదిలివేస్తున్నారు. మండల కేంద్రంలోని అర్కతల గేట్ సమీపం నుంచి మాదారం గ్రామం చివర వరకు బీటీ రోడ్డును వేసి రైతులు, వాహనదారులకు రవాణా పరంగా సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు కల్వర్టు నిర్మాణ పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మాదారం నుంచి కద్చర్ల, మీనాపల్లి కలాన్ నుంచి మాదారం వెళ్లే మార్గంలో రూ. 20లక్షలు ఖర్చుచేసి కల్వర్టులను నిర్మించారు. దీంతో రైతులు, వాహనదారుల బాధలు తీరినవి అనుకున్న ఆనందంలో కల్వర్టులపై ప్రమాదాన్ని నివారించే పనులను మాత్రం అలాగే వదిలి వేయగా, మరింత ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. కల్వర్టు నిర్మాణం చేసిన వెంటనే ప్రమాదాలను నివారించేందుకు పక్కల ఖానాలను కూడా కట్టండి అని కాంట్రాక్టర్‌ను రైతులు కోరిన కూడా కూలీలు దొరకడంలేదని దాటవేసే ప్రయత్నం చేస్తున్నాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కల్వర్టు మీదుగా వెళ్లాలంటే భయంగా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ఏఈని అడుగగా తాను ఇన్‌చార్జినని, గతంలో ఉన్న ఏఈకే తెలుసు.. తాను వచ్చిన సమయంలో ఈ పని ఏదీ కూడా నిర్మాణం కాలేదు అని వెల్లడించారు. దీంతో గతంలో పనిచేయించిన ఏఈ లక్ష్మయ్యను వివరణ కోరగా, తాను కూడా కాంట్రాక్టరుకు చెప్పాను కూలీలు రాగానే చేయిస్తాను అని హామీ ఇచ్చారని సమాధానం ఇస్తున్నారు.

కాంట్రాక్టర్ దృష్టిలో ఉంది ...

కల్వర్టులను నిర్మిస్తున్నప్పుడు అన్నింటినీ దృష్టిలో ఉంచుకునే పనులు మొదలు పెడుతాం. ఇప్పటికైనా కాంట్రాక్టరుకు మరొకసారి చెప్పి కూలీలు అందుబాటులో ఉన్న సమయంలో పూర్తి చేస్తాం. పక్కనే అక్నాపూర్ గ్రామం వద్ద పని జరుగుతుంది అక్కడ అయిపోగానే చేయిస్తాం. రెండు కల్వర్టులకు కలిపి రూ. 20లక్షలు ఖర్చు పెట్టాం.

– లక్ష్మయ్య, ఏఈ

ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది..

కల్వర్టుపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. తొందరగా ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టరుకు ఇక్కడ ఉండే రైతులం చెప్పినా చేస్తాం, చూస్తాం అని ఇంకా చేయలేదు. రైతులు రాత్రి సమయంలో ఇక్కడ నుంచి వెళ్తుంటే ప్రమాదం జరుగుతుందనే భయంతోనే ఇంటికి వెళుతాం. తొందరగా కల్వర్టుపై ప్రమాదాలను నివారించేందుకు పనులను పూర్తి చేయాలి.

– మునూర్ విష్ణు, రైతు– మాదారం గ్రామం

ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి

చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

బషీరాబాద్, మార్చి 19: సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ తహసీల్దార్ వై. వెంకటేశ్‌అన్నారు. మండల పరిధిలోని ఇందర్ చేడ్, నవంద్గి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం తరలించే అవకాశం ఉంటుందని, 24 గంటల పాటు అప్రమతంగా ఉండాలని చెక్ పోస్టు సిబ్బందికి సూచించారు. చెక్ పోస్టు గుండా వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎక్మాయి, మైల్వార్ గ్రామాలను సందర్శించి పోలింగ్‌బూత్, నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలను పరిశీలిం చారు. మైల్వార్ గ్రామంలో పంచాయతీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, ఉపాధి పనులు, గ్రామంలో నీటి సరఫరా, పారిశుధ్యం పనులపై సమీక్షించారు. కార్యక్ర మంలో ఆర్ఐ రాకేశ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

వికారాబాద్, మార్చి 19 : వికారాబాద్ ఆర్డీవోగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన వసు చంద్రను వికారాబాద్ మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహ సీల్దార్ రాజేందర్‌రెడ్డి మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వికారాబాద్ ఆర్డీవో వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు విషయాలపై చర్చించారు. అనంతరం పదో తరగతి పరీక్షలు జరుగు తున్నందునా పట్టణంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేశారా లేదా అని ఆరా తీశారు.

ఎల్లమ్మ క్షేత్రం భక్తజన సంద్రం

బొంరాస్‌పేట, మార్చి 19 : దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి వేల సంఖ్యలో తరలివచ్చారు. బోనాలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభను కనబర్చాలి

విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న శిక్షణా ఫౌండేషన్ నిర్వాహకులు

కులకచర్ల, మార్చి 19 : విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభను కనబర్చాలని శిక్షణా ఫౌండేషన్ జిల్లా సీనియర్ మెంటర్లు నాగరాజు, రాములు అన్నారు. మండల పరిధిలోని శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏడు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కులకచర్ల పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని పొందారు. ద్వితీయ బహుమతని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల రాంపూర్ విద్యార్థులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా ఫౌండేషన్ మెంటర్ల నవీన్, రమేశ్, భ్రమరాంబ, మంజుల, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పరిగి టౌన్, మార్చి 19 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని మంగళవారం పరిగిలో సీపీఎం, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, చంద్రయ్య, ఐద్వా మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి

పూడూరు మార్చి 19: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని డీఎల్‌పీవో సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం చీలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మొగులయ్యపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించి స్థానికుల నుంచి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలకు అందు బాటులో ఉండాలన్నారు. నూతన గృహాలు నిర్మాణం చేసేవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుందర్, ఇన్‌చార్జి కార్యదర్శి మాణిక్యం ఉన్నారు.

▪ గురునాథ్‌రెడ్డికి సన్మానం..



బొంరాస్‌పేట, మార్చి 19 : రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురునాథ్‌రెడ్డిని మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ దేశ్యానాయక్, మండల కాంగ్రెస్ నాయకులు నర్సింహులు నాయుడు, కోపూరు వీరేశం, మాజీ ఎంపీటీసీ రవినాయక్, మల్లికార్జున్, మల్లేశం, ఉమాపతి, ఢాక్యానాయక్ తదితరులు గురునాథ్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గురునాథ్‌రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డి మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విర్కమార్కను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి.. కృతజ్ఞతలు తెలిపారు.

– బడంగ్‌పేట, మార్చి 19

పార్టీలకతీతంగా అభివృద్ధి చేశా : ఎంపీ రంజిత్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 19 : ఐదేండ్లుగా పార్టీలకతీతంగా అభివృద్ధి చేశానని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సందర్భంగా చెప్పిన పనులు చేశానని చెప్పారు. మంగళవారం పరిగిలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి ప్రజా ప్రతినిధులు అనుసంధానంగా ఉండాలన్నారు. అధిష్ఠానం తనకు ఎంపీ టికెట్ ఇస్తే పార్టీ నాయకులందరి చేయూతతో మంచి మెజారిటీతో గెలుపొందుతానన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది ప్రజల సంక్షేమం కోసమన్నారు. రాజకీయాల్లో ఉంటేనే సేవలు అందించగలుగుతామన్నారు. అభివృద్ధి పనులు ఎన్ని చేసినా ఇంకా మిగిలి ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పనులన్నీ చేయించగలిగితే ఆర్థికంగా నియోజకవర్గం, జిల్లా ముందు వరుసలో నిలుస్తుందన్నారు. రాబోయే రోజులలో విద్య, వైద్య పరంగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2500కోట్లతో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, వికారా బాద్ నుంచి పరిగి నియోజకవర్గం మీదుగా కృష్ణా రైల్వేలైన్ నిర్మాణానికి సర్వే జరుగుతుందని, రాష్ట్ర వాటా నిధులు సైతం విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రాణహిత–చేవెళ్ల పనులు మళ్లీ ప్రారంభించడంతోపాటు పాలమూర్–రంగారెడ్డి పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, వెటర్నరీ, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరయ్యాయని, తద్వారా వెయ్యి పడకల ఆసుపత్రి వస్తుందని అన్నారు. పరిగి, కొడంగల్ నియోజకవర్గాలకు సుమారు పదివేల కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. 2050 విజన్ పేరిట మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారని, జిల్లాలో పరి శ్రమల ఏర్పాటుకు క్లస్టర్‌లు ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపిపి సత్యమ్మ, కాంగ్రెస్ నాయకులు లాల్‌కృష్ణప్రసాద్, ఎ.కృష్ణ, పాలాది శ్రీనివాస్, కడుమూరి ఆనందం, హన్మంతు, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరిన్ని పరిశోధనలు చేపట్టాలి

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 19 : ఉద్యాన రంగంలో మేథో సంపత్తి హక్కులతో ఉపాధి అవకాశాలు మెరుగు, అధిక అవకాశాలు, ఆదాయం మెరుగవుతాయని ప్రముఖ పేటెంట్ నిపుణులు శుభాజిత్‌సాహ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యాన రంగంలో మేథో సంపతి హక్కుల ఆవిష్కరణతో అధిక ఆదాయం లభించనున్నదని, తెలంగాణలో అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నాయని వాటిలో మేథో సంపత్తిని హక్కులుగా మార్చేందుకు సిద్ధం కావాలని సూచించారు. భౌగోళిక గుర్తింపునకు అనువైన అంశాలు, విధానం పొందిన ఉత్పత్తుల వివరాలు దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు, పంటలలో రైతులు, 20–30 శాతం అధిక లాభాలు, మార్కెట్ ధరలు పొందుతున్నారన్నారు. మరో 8 నుంచి 10 ఉద్యాన పంటలు భౌగోళిక గుర్తింపునకు అనువుగా ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయాలు, రైతులు, ప్రభుత్వం కలిసికట్టుగా ముందుకొస్తే రాష్ట్రం నుంచి అనేక ఉత్పత్తులను భౌగోళిక గుర్తింపులు ఉన్న ప్రదేశాలలో టూరిజంకు అవకాశాలు ఉంటాయన్నారు. డీన్ డా, రాజశేఖర్ మాట్లాడుతూ.. పరిశోధనలో సృజనాత్మకత అంశాలు రైతులకు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వెతికే దిశగా పరిశోధన చేపట్టాలని సూచించారు.

మద్యం బాబులకు జైలు శిక్ష, జరిమానా

సైదాబాద్, మార్చి 19 : మద్యం తాగా వాహనాలను నడుపుతున్న మందుబాబులకు నాంపల్లి తొమ్మిదో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జైలు శిక్షలతోపాటు జరిమానా విధించారని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద్విచక్ర, మూడు చక్రల వాహనాలను మద్యం సేవించిన మత్తులో నడిపి పట్టుబడ్డ తొమ్మిది మందికి జైలు శిక్షతోపాటు రూ.41,100 జరిమానా విధించిందన్నారు. మొదటిసారి పట్టుబడ్డ వ్యక్తి రెండు రోజుల శిక్షతోపాటు రూ.2,100 జరిమానా విధించిందని, అదే విధంగా రెండోసారి పట్టుబడ్డ ఏడు మందికి నాలుగురోజుల జైలు శిక్షతోపాటు రూ.3,300 జరిమానాను విధించిందని, మూడోసారి పట్టుబడ్డ ఒక వ్యక్తి ఏడు రోజుల జైలు శిక్షతోపాటు రూ.3,300 జరిమానా విధించినందని తెలిపారు.

కల్తీ ఉత్పత్తులపై..

ఎస్‌వోటీ దాడులు

శంషాబాద్ రూరల్, మార్చి 19 : ఆహార ఉత్పత్తుల కల్తీ నిల్వలు చేయడమే కాకుండా వాటిని అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు సదరు నిల్వలపై దాడులు చేశారు. అక్రమంగా నిల్వ చేసిన వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ వ్యక్తిని అరెస్టు చేసి ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని సింప్లెక్స్ సమీపంలో బాలాజీ కంపెనీ పేరుతో నకిలీ వస్తువులు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కంపెనీపై దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన, కాలం చెల్లిన ఆహార ఉత్పత్తుల కల్తీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 18 రకాల 771 లీటర్ల సాసులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాలం చెల్లిన వాటిపై కొత్త తేదీలు అతికించి మార్కెట్‌లో అమ్ముతున్న వాటిని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాల్‌రాజు వివరించారు.

నూతన నియామకం

కందుకూరు, మార్చి 19: చిప్పలపల్లి గ్రామ మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడిగా అంబటి కృష్ణా ముదిరాజ్ ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి ఖదీర్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా మామిళ్ల రాజు ముదిరాజ్, కార్యదర్శిగా పొలెమోని సురేశ్ ముదిరాజ్, డైరెక్టర్లుగా గోపాల్ దాస్ జంగయ్య, అంబటి యాదగిరి ముదిరాజ్, పొలెమోని రమేశ్ ముదిరాజ్, మిద్దెల రవి ముదిరాజ్, దిద్దెల లక్ష్మయ్య ముదిరాజ్, మామిళ్ల ప్రవీణ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కందుకూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కందుకూరు, మార్చి 19 : ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కందుకూరు సీఐ మక్బూల్ జానీ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు బేగంపేట్, తిమ్మాపూరు, రాచులూరు గ్రామాల్లో సీఏపీఎఫ్ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛగా ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరికి బయపడకుండా తమ ఓటును పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా బెదిరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని.. పోలీసులు రక్షణగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రావణ్ కుమార్. వెంకటయ్య.సైదులు.పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీతో.. విప్లవాత్మ క మార్పు

వ్యవసాయ యూనివర్సిటీ,మార్చి 19: సమాజ పోకడలలో విప్లవాత్మక మార్పు ఫొటో గ్రఫీదని, అనేక అర్థాలు, సమాచారం ఇస్తున్నదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొ. డా. మాధవి రవికుమార్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ విద్యార్థులకు ఫొటోగ్రఫీపై నైపుణ్యత వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక ఫొటో వెయ్యి పదాలకు సమానమని, విద్యార్థులకు ఫొటో గ్రఫీలో గల వివిధ అంశాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ నరేందర్‌రెడ్డి , డా. ఈశ్వరి, డా. సవిత తదితరులు పాల్గొని విద్యార్థులకు ఫొటోగ్రఫీపై అవగాహన కల్పించారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Valgari Malkappa S/o Valgari Buggappa, age 53 years, Occ: Business, R/o H.No.9-85, Doulthabad Village, Doulthabad Mandal, Vikarabad Dist., **Applicant / Borrower,** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 5 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

Residential house bearing No.6-271 (New No.6-262), Constructed in residential plot admeasuring 444.41 Sq.Yrds., out of Sy.No.533/1/1 situated at Doulthabad Village, Doulthabad Mandal, Vikarabad Dist. which is bounded as under; **East:** Remaining land of Vendor, **West:** Doulthabad to Narayanpet Road, **North:** Plot of Mangali Bicchappa, **South:** Plot of Purchaser

MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Volgiri Mahipal S/o Valigiri Malkappa, age 31 years, Occ: Business, R/o H.No.6-271, Doulthabad Village, Doulthabad Mandal, Vikarabad Dist.. **Applicant / Borrower,** Valgari Malkapaa S/o Valgari Buggappa, age 53 years, Occ: Business, R/o H.No.9-85, Doulthabad Village, Doulthabad Mandal, Vikarabad Dist. **Co-Borrowers/Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 5 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

The Commercial shopping complex bearing No.6-254, constructed in residential plots admeasuring 306 Sq.Yrds., out of Sy.No.533 situated at Doulthabad Village, Doulthabad Mandal, Vikarabad Dist., which is bounded as under; **East:** Land in Sy.No.533, **West:** Land in Sy.No.533, **North:** Land in Sy.No.533, **South:** Zilla Parishad Road

MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742